కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు

- సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు
- మెట్‌పల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సు

మారుతీనగర్, జనవరి 18: కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు అన్నారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు మద్యం, ఇతరాత్ర వ్యసనాలకు బానిసకావొద్దన్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ఉచిత న్యాయ సేవలు పొందేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉందని, అవసరమైనప్పుడు నేరుగా తమను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు ఉపయోగించుకోవాలన్నారు. హమాలీలు, భవన నిర్మాణ, ఆటో, ఇతర రంగాలకు చెందిన కార్మికులు కార్మిక సంక్షేమ చట్టాల ప్రయోజనాలు పొందాలని కోరారు. అదేవిధంగా కార్మిక చట్టాలకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. తాపీ మేస్త్రీ అయిన తన తండ్రితో కలిసి భవన నిర్మాణ పనులు చేపడుతూనే చదువుకున్న రోజులను న్యాయమూర్తి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం న్యాయమూర్తిని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ కిరణ్‌కుమార్, కార్మికశాఖ సహాయ అధికారి కృష్ణసాగర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు రాంబాబు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడి సిగ్గుచేటు

- బీఆర్ఎస్ కొడిమ్యాల మండల నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న నాయకులు

కొడిమ్యాల, జనవరి 18: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి శనివారం బీఆర్ఎస్ మండల నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గంగాధర మండలం బూర్గుపల్లిలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై కొంతమంది కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు ప్రతి విమర్శలు ఉండాలని, దాడులకు దిగేంత ఉండకూడదన్నారు. మరోసారి దాడులకు పాల్పడితే గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, పట్టణాధ్యక్షుడు కొత్తూరి స్వామి, మండల ఉపాధ్యక్షుడు రొడ్డ శరత్, రైతు బంధు సమితి జిల్లా మాజీ సభ్యుడు బండపల్లి అంజన్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ పర్లపల్లి ఆనందం, నాయకులు పర్లపల్లి ప్రభుదాస్, బైరి వెంకటి, రామంచ లక్ష్మణ్, రాచకొండ చంద్, ఆకునూరి మల్లయ్య, జాలిగపు బాబు, చందు, శాప్రణ్, అఖిల్, రాకేశ్, మహేశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్ సెంటర్ వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

నవోదయ ప్రవేశ పరీక్ష

వెల్గటూర్, జనవరి 18: వెల్గటూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రంలో 237 మంది విద్యార్థులకు గానూ 198 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ తెలిపారు. పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్‌గా చిప్ప నదయ్య, సెంటర్ లెవల్ అబ్జర్వర్‌గా రాజ్‌కుమార్ వ్యవహరించారు. ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెండింగ్ బిల్లులు విడుదల చెల్లించాలి

జగిత్యాల, జనవరి 18: పెన్షనర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును టీ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య కలిసి విన్నవించినట్లు తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాశ్ రావు, ఎండీ యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూసాల అశోక్ రావు, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, మెట్‌పల్లి అధ్యక్షుడు ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి

ధర్మపురి, జనవరి 18: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమని బుగ్గారం ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామంలో శనివారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. మండలంలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ బల్మూరి రామారావు, పంచాయతీ కార్యదర్శి అమీర్, హెడ్ కానిస్టేబుల్ పులి రవి, శంకరయ్య, మధన్, సనత్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

చెక్కుల పంపిణీ

జగిత్యాల, జనవరి 18: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అపోహలు వద్దని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 108 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రైతు భరోసా త్వరలో పంపిణీ చేస్తామని, అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, తహసీల్దార్లు శ్రీనివాస్, రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్లు కొలుగురి దామోదర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, నాయకులు సురేందర్ రావు, బాల ముకుందం, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన బస్సు ప్రమాదం

మెట్‌పల్లి, జనవరి 18: మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు డ్రైవర్ కళ్లుతిరిగి స్పృహ తప్పిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ అద్దె బస్సు మెట్‌పల్లి బస్టాండ్ నుంచి రాయికల్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో పాత బస్టాండ్ వద్ద ప్రయాణీకులను ఎక్కించుకునేందుకు బస్సు ఆపుతున్న క్రమంలో డ్రైవర్ సతీశ్ ఒక్కసారిగా కళ్లుతిరిగి స్పృహ కోల్పోయాడు. గమనించిన కండక్టర్, మరికొందరు ప్రయాణీకులు అప్రమత్తమై బస్సు ముందుకు వెళ్లకుండా నిలిపేశారు. వెంటనే డ్రైవర్‌ను అంబులెన్స్‌లో స్థానిక దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ డీఎం దేవరాజు దవాఖానకు వెళ్లి డ్రైవర్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను

డ్రైవర్‌ను పరామర్శిస్తున్న ఆర్టీసీ డీఎం దేవరాజు

అడిగి తెలుసుకున్నారు. మరో వైపు బస్సులోని ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. మరో డ్రైవర్‌ను ఏర్పాటు చేసిన రాయికల్‌కు బస్సు సర్వీస్‌ను నడిపారు.

గొర్రెపల్లిలో పశువైద్య శిబిరం

మల్లాపూర్, జనవరి 18: మండలంలోని గొర్రెపల్లి గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 47 బర్రెలు, ఆవులకు గర్భకోశ వ్యాధుల నివారణ టీకాలను వేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి శ్రీనివాస్, సిబ్బంది, రవి, లక్ష్మీనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెట్‌పల్లి, జనవరి 18: పెంబట్ల-కోనాపూర్‌లోని 220/132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ సరఫరా ఉండదని మెట్‌పల్లి డీఈఈ గంగారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ ఫేస్ సరఫరా మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో మాత్రం త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేచపల్లిలో యువతకు అవగాహన

యువతకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

సారంగాపూర్, జనవరి 18: మండలంలోని రేచపల్లి గ్రామంలో శనివారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ప్రస్తుత పరిస్థితుల్లో యువత ఎలా ఉండాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల పరిశీలన

ఇటుక బట్టీలను పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూదన్

కొడిమ్యాల, జనవరి 18: మండలంలోని కొడిమ్యాల గ్రామంలో ఇటుక బట్టీలు, రేషన్ కార్డుల సర్వే, అప్పారావుపేట గ్రామంలో లే-అవుట్లను జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుట్టబోర్లు, నాలా కట్టిన లేఅవుట్ స్థలాలను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. రేషన్ కార్డుల సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కిరణ్, ఏవో జ్యోతి, కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

పెగడపల్లి, జనవరి 18: మండలంలో ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న శాలపల్లి, ఏడుమోటలపల్లి, రాజరాంపల్లి, ఐతుపల్లి, ఆరవల్లి, కీచులాటపల్లిలో, 22న లింగాపూర్, నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, నందగిరి, దేవికొండ, మద్దులపల్లిలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే, 23న బతికపల్లి, ల్యాగలమర్రి, సుద్దపల్లి, దోమలకుంట, రాములపల్లి, రాంబద్రునిపల్లిలో, 24న పెగడపల్లి, నర్సింహునిపేట, ఎల్లాపూర్, వెంగళాయిపేట, నంచర్లలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నామాపూర్‌లో వైద్య శిబిరం

పెగడపల్లి, జనవరి 18: పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామంలో మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 50 మంది గ్రామస్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి నరేశ్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, సంధ్య, చంద్రకళ, స్వప్న, లత, మణెమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల ఎంపికకు సర్వే

పెగడపల్లి, జనవరి 18: మండల కేంద్రంలో శనివారం రేషన్ కార్డుల కోసం అర్హుల ఎంపిక సర్వే చేపట్టారు. మండలానికి 925 రేషన్ కార్డులు మంజూరయ్యాయని, అర్హుల ఎంపికకు సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కారోబార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

జగిత్యాల, జనవరి 18: శ్రీనివాస్ పేరు గల వారందరూ కలిసి సంఘంగా ఏర్పడి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే, సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జగిత్యాలలో తలసేమియా బాధిత పిల్లలకు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు శ్రీనివాసుల సంఘం ప్రతినిధి, ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ తెలిపారు. జగిత్యాలలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరవుతారని పేర్కొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 18: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన శనివారం జగిత్యాల పట్టణంలో జరిగింది. జగిత్యాల టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన తిరుపతమ్మ(40) పాత కలెక్టరేట్ ప్రాంతంలోని ఓ డెయిరీలో పెరుగు ప్యాకెట్ కొనుగోలు చేసి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి దాటుతున్నది. ఈ క్రమంలో జగిత్యాల వైపు నుంచి వచ్చిన బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. తిరుపతమ్మ తమ్ముడు పత్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మేడిపల్లి, జనవరి 18 : మేడిపల్లి మండలం రంగాపూర్ గ్రామ శివారులో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ శనివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 13,820 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వృద్ధుల ఫిర్యాదులపై విచారణ

జగిత్యాల, జనవరి 18: తమను నిరాదరిస్తున్న కుమారులపై వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మధుసూదన్‌కు జగిత్యాల డివిజన్ పరిధిలోని వృద్ధులు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఏవో తఫజుల్ హుస్సేన్ ఫిర్యాదుదారులు, వారి కుటుంబ సభ్యులను విచారించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, ఎఫ్ఆర్వో కొండయ్య, కౌన్సెలింగ్ అసిస్టెంట్ వెల్ముల ప్రకాశ్ రావు, ట్రిబ్యునల్ సెక్షన్ అసిస్టెంట్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ

మల్యాల, జనవరి 18: కొండగట్టు అంజన్న ఆలయ ఈవోగా శ్రీకాంత్ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, హరిహరనాథ్, నీల చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకుడు జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఈవో శ్రీకాంతరావు

సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలి

కోరుట్ల రూరల్, జనవరి 18: సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీ వల్లభ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బోగ రవికుమార్ కోరారు. స్థానిక ప్రభుత్వ దవాఖానలో శనివారం ఆయన ట్రస్ట్ సభ్యులతో కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ముక్క దాము, మల్లయ్య, తుమ్మనపెల్లి మహేశ్, ప్రభాకర్-స్వరూప, వెంకటేశం, రాములు, రాధకిషన్, వెంకటకిష్టయ్య పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన ఆర్డీవో

అధికారులు సర్వే చేస్తున్న తీరును పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూదన్

మల్యాల, జనవరి 18: మండల కేంద్రంలో రేషన్ కార్డుల కోసం అర్హుల ఎంపికకు శనివారం చేపట్టిన సర్వేను ఆర్డీవో పులి మధుసూదన్ పరిశీలించారు. సర్వే వివరాలు పంచాయతీ అధికారి శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మల్యాల తహసీల్దార్ మునీంధర్, ఆర్ఐ రాణి, తిరుపతి తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కోరుట్ల రూరల్, జనవరి 18: మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన ఎన్ లక్ష్మికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. లక్షా యాభై వేల ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, పట్టణంలో కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శనివారం లక్ష్మి కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, నల్ల బాపురెడ్డి, శ్రీనివాస్, నేమూరి భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి రూరల్, జనవరి 18: మెట్‌పల్లి మండలం పాటిమీది తండా, ఆత్మకూర్ శివారులో అటవీ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మెట్‌పల్లి అటవీ శాఖ కార్యాలయానికి వెళ్లి ఎఫ్ఆర్వో షౌకత్ అలీని కలిసి మాట్లాడారు. అటవీ భూముల అన్యాక్రాంతంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని నిలదీశారు. అటవీ భూములకు హద్దులు ఏర్పాటు చేసి, ఆక్రమణలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాలెపు నీల, వీడీసీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్, నేరెళ్ల శ్రీధర్, దుద్దుల తిరుపతి, చౌట్‌పల్లి అంజయ్య, కేసిరెడ్డి నవీన్‌రెడ్డి, తుమ్మల రాజారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు సత్కారం

కోరుట్ల రూరల్, జనవరి 18: ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కొక్కుల మురళి, ప్రధాన కార్యదర్శిగా వంగ వంశీ, కార్యవర్గ సభ్యులుగా కట్కం శివ, బుడిగె సతీశ్ ఎన్నిక కాగా, శనివారం కోరుట్ల కెమెరా క్లబ్ సభ్యులు శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చలిగంటి వినోద్‌కుమార్, అల్వాల శంకర్, నల్ల శివ, దొంతుల రాము, బండ్ల సురేశ్, నరేందర్, బింగి శేఖర్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న కెమెరా క్లబ్ సభ్యులు

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మేడిపల్లి, జనవరి 18: తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ మెయిల్ ఓవర్ రాచమల్లి శ్రీకాంత్ కోరారు. భీమారం మండల కేంద్రంలోని పోస్టల్ కార్యాలయంలో శనివారం సుకన్య సమృద్ధి యోజన, ఆన్‌లైన్ బ్యాంకింగ్, సేవింగ్ ఖాతాలు, డిపాజిట్, బీమా, తదితర సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ వేణు మాధవశర్మ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూములు గుర్తింపు

జగిత్యాల టౌన్, జనవరి 18: రైతు భరోసా పథకం అమలు కోసం సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు జిల్లాలో సర్వే చేపట్టారు. శనివారం వరకు జిల్లాలో 658.1 ఎకరాలు వ్యవసాయేతర భూమిగా అధికారులు గుర్తించారు. జగిత్యాల మండలం అంతర్గాంలో సర్వే తీరును జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్ పరిశీలించారు. బీర్‌పూర్ మండలంలో 5.2 ఎకరాలు, భీమారంలో 10.3, బుగ్గారంలో 38, ధర్మపురిలో 64.35, ఎండపెల్లిలో 13.04, గొల్లపల్లిలో 14.36, ఇబ్రహీంపట్నంలో 8.09, జగిత్యాల అర్బన్‌లో 51.2, జగిత్యాల రూరల్‌లో 14.1, కథలాపూర్‌లో 119.3, కొడిమ్యాలలో 47, కోరుట్లలో 38.3, మల్లాపూర్‌లో 6.1, మల్యాలలో 34.02, మేడిపల్లిలో 7.16, మెట్‌పల్లిలో 41.28, పెగడపల్లిలో 4, రాయికల్‌లో 76, సారంగాపూర్‌లో 17.05, వెల్గటూర్ మండలంలో 49.24 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తించినట్లు జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కోరుట్ల రూరల్, జనవరి 18 : సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో పట్టణంలోని మాస్ట్రో కళాశాల విద్యార్థి మదిహ మహవీన్ ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఆకుల రాజేశ్ శనివారం తెలిపారు. విద్యార్థిని కళాశాల అధ్యాపకులతో పాటు తోటి విద్యార్థులు అభినందించారు.

దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం

జగిత్యాల రూరల్, జనవరి 18: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ఉపాధి, పునరావాస పథకం ప్రవేశపెట్టిందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ. 50 వేలు సబ్సిడీ, రూ. 2 లక్షల యూనిట్‌కు రూ. 1.40 లక్షలు సబ్సిడీ, రూ. 3 లక్షల యూనిట్‌కు రూ. 1.80 లక్షలు సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో ఈనెల 23 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 40 శాతం వైకల్యం ఉండి, 21 నుంచి 55 ఏళ్ల వయసు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. లక్షా యాభై వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల వార్షికాదాయం ఉన్న వారు అర్హులన్నారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటామని పేర్కొన్నారు

భార్య కాపురానికి రావడం లేదని..

వెల్గటూర్, జనవరి 18: ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన మాసుపాటి రమేశ్ (38) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్‌కు భార్య పద్మతోకుటుంబ విషయంలో తరచూ గొడవలు జరిగేవి. దీంతో పద్మ తన తల్లిగారిల్లు అయినా వెదురుగట్టకు పిల్లలను తీసుకుని 2017లో వెళ్లిపోయింది. రమేశ్ కూడా అక్కడికే వెళ్లి పిల్లలతో ఉంటూ అప్పుడప్పుడు ఎండపల్లికి వస్తూ పోతూ ఉండేవాడు. తనకు అక్కడ ఉండడం ఇష్టం లేదని, నా భార్య ఇక్కడకు రానంటున్నదని తల్లి లచ్చవ్వతో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఇదే విషయంలో భార్యతో గొడవ పడి నాలుగు నెలలుగా ఎండపల్లిలోనే ఉంటున్నాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన రమేశ్ శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్ ఉమాసాగర్ తెలిపారు.

రత్నాపూర్ వాసికి డాక్టరేట్

మల్లాపూర్, జనవరి 18: ఉస్మానియా యూనివర్సిటీలో అర్థశాస్త్ర విభాగంలో 'తెలంగాణలో ప్రధానమంత్రి జన్ ధన్ యోజన ద్వారా ఆర్థిక సమ్మిళితం అధ్యయనం' అంశంపై రత్నాపూర్ గ్రామానికి చెందిన బాస మధు పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. కాగా, మధుకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నిలిచిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

మెట్‌పల్లి ,జనవరి 18: మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఇక్కడి సబ్‌రిజిస్ట్రార్ ఆసిఫొద్దీన్ ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్‌కు అప్పగించారు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం నుంచి సబ్‌